క్లుప్తంగా

రూరల్ తహసీల్దారుగా శివన్నారాయణ



ఆరిలోవ: రూరల్ మండలం తహసీల్దారుగా ఎన్.శివన్నారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇంత వరకు తహసీల్దారుగా పని చేసిన సనపల రమణయ్య విజయనగరం జిల్లా బొండపల్లి మండలం తహసీల్దారుగా బదిలీ అయ్యారు. ఈయన రూరల్ మండలం నుంచి రిలీవైన రోజే హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ముందుగా కొత్తవలస తహసీల్దారు మిశ్రాను బదిలీ చేశారు. రమణయ్య హత్య సంఘటనతో మిశ్రా ఇక్కడికి రావడానికి ఆసక్తి కనబరచలేదు. దీంతో పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం తహసీల్దారు ఎన్.శివన్నారాయణను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో విజయనగరం జిల్లా గరివిడి మండలంలో తహసీల్దారుగా పని చేశారు.

‘పెన్షనర్ల సమస్యలపై కేంద్రం మొండి వైఖరి’



ధర్నాలో పాల్గొన్న పెన్షనర్లు

విశాఖ విద్య: పింఛన్‌దారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మద్దిపాలెం లోని పీఎఫ్ రీజినల్ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నా కొనసాగుతోంది. మూడో రోజు బుధవారం జరిగిన ధర్నాలో బీహెచ్ఈఎల్ రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే హుస్సేన్ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరితో వ్యవహరించడం సరికాదన్నారు. పెన్షనర్ల కుటుంబాల ఆర్థిక ఇబ్బందులు తీరేలా మినిమం పింఛన్ అమలు చేయాలన్నారు. రైల్వే రాయితీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు అందిస్తున్న పల్లా దుర్గారావు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులోని జైసంతోషిమాత కాలనీలో ప్రభుత్వం మంజూరు చేసిన ఆరోగ్య శ్రీకార్డులను బుధవారం పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు పాల్గొని లబ్ధిదారులకు ఈ కార్డు లను అందజేశారు. ఈ కార్డుతో రూ.25 లక్షల వరకు విలువైన వైద్యాన్ని కార్పొరేట్ ఆస్పత్రిలో చేయించుకోవచ్చునని దుర్గారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సంపంగి సురేష్, చట్టి చిన్న, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

లలితా పీఠంలో సుదర్శన హోమం



సుదర్శన హోమం చేస్తున్న పండితులు

సీతంపేట: బహుళ ద్వాదశి సందర్భంగా బుధవారం లలితానగర్ లలితా పీఠంలో వేద పండితులు శాస్త్రోక్తంగా సుదర్శన హోమం నిర్వహించారు. పలువురు భక్తులు పూజలు చేశారు. హోమంలో పాల్గొన్న వారికి ప్రతికూల ప్రభావం నుంచి విముక్తి లభించడం, శత్రువులపై విజయం సాధిస్తారని వేద పండితులు తెలిపారు. మాస శివరాత్రి సందర్భంగా గురువారం కాశీ కాలభైరవులకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

100 అడుగుల రహదారికి తుది మెరుగులు





విద్యుద్దీప కాంతుల మధ్య కళకళలాడుతున్న మానసిక ఆస్పత్రి రహదారి



ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన దీపాలు

- పోలమాంబ ఆలయం నుంచి బీచ్ రోడ్డు మార్గం ఆధునికీకరణ
- రూ.5 కోట్లతో చురుగ్గా విస్తరణ పనులు

ఏయూ క్యాంపస్: గతంలో ఆ మార్గంలో ప్రయాణించాలంటే హడలిపోయేవారు. పురుషులు సైతం ఆ రోడ్డులో వెళ్లాలంటే ఒక క్షణం ఆలోచించే పరిస్థితి. మరి ఇప్పుడు.. ఆ రహదారి స్వరూపం పూర్తిగా మారిపోయింది. ఇరుకుమయంగా గోతుల నిండిన ఆ రోడ్డు రూపురేఖలు మారిపోయాయి. అదే పెదవాల్తేరులోని పోలమాంబ ఆలయం నుంచి బీచ్ రోడ్డుకు వెళ్లే మార్గం ఆధునికీకరణతో కళకళలాడుతోంది.

60 నుంచి 100 అడుగులకు విస్తరణ

ప్రస్తుతం పోలమాంబ ఆలయం నుంచి వీఎంఆర్‌డీఏ పార్కుకు వెళ్లే రహదారిని 60 అడుగుల నుంచి 100 అడుగులకు విస్తరిస్తున్నారు. ఇప్పటికే పోలమాంబ ఆలయం నుంచి మానసిక ఆస్పత్రి కూడలి వరకు రహదారి నిర్మాణం, డివైడర్లు, విద్యుత్ లైట్ల ఏర్పాట్లకు వైరింగ్ పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం మానసిక ఆస్పత్రి కూడలి నుంచి వీఎంఆర్‌డీఏ పార్కు వరకు రహదారి విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీనికి ఆర్ అండ్ బీ శాఖ నుంచి దాదాపు రూ.5 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. పోలమాంబ ఆలయం నుంచి ఈఎస్‌టీ, ఛాతీ ఆస్పత్రి, మానసిక ఆస్పత్రి మీదుగా వెళ్లే ఈ రహదారి సగం పూర్తయింది. పోలమాంబ ఆలయం నుంచి మానసిక ఆస్పత్రి కూడలి వరకు రహదారి దాదాపుగా పూర్తయి తుది మెరుగులు, సుందరీకరణ పనులకు సిద్ధమవుతోంది. రాత్రి వేళల్లో ఈ రహదారి ఎంతో సుందరంగా దర్శనమిస్తోంది. రహదారి మధ్యలో డివైడర్‌పై, అలాగే ఫుట్‌పాత్‌పైన కూడా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. విశాలమైన వంపులు తిరిగిన రహదారి, మధ్యలో, ఇరువైపులా మిరుమిట్లు గొలిపే అధునాతన విద్యుత్ దీప కాంతులు కొత్త అనుభూతిని కలిగిస్తున్నాయి. కొంతమంది ఈ మార్గంలో ఫొటోలు తీసుకోవడానికి, వీడియోలు చిత్రీకరణకు సైతం ఆసక్తి చూపుతున్నారు. మానసిక ఆస్పత్రి కూడలి నుంచి వీఎంఆర్‌డీఏ పార్కు వరకు తలపెట్టిన పనులు పూర్తయితే మరింత ప్రత్యేకతను ఈ రహదారి సంతరించుకోనుంది.

ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు

- దివ్యాంగులు, ఓటర్లకు కనీస వసతులు కల్పించండి
- అధికారులతో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్, పాల్గొన్న అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు

మహారాణిపేట: సాధారణ ఎన్నికలకు ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు తప్పక కల్పించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం తూర్పు నియోజకవర్గానికి సంబంధించి ఏఈఆర్వోలు, వివిధ శాఖల అధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని బీఎల్వోలతో కలిసి తనిఖీ చేయాలని ఆదేశించారు. కేంద్రం వద్ద దివ్యాంగులకు ర్యాంపులు, ఓటర్లకు టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ బూత్ బయట ఆ కేంద్రం వివరాలు తప్పక నమోదు చేయాలని చెప్పారు. 10 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న ఇళ్లను పరిశీలించాలన్నారు. జనవరి 5 తరువాత అందిన ప్రతి ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, చేరికలు, తొలగింపులు జాగ్రత్తగా చేపట్టాలన్నారు.

సమస్యలుంటే తెలపండి..

ఓటరు జాబితాలు, పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా సమస్యలుంటే తక్షణం తెలియజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను జేసీ మయూర్ అశోక్ కోరారు. కలెక్టరేట్‌లో తూర్పు నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. తూర్పు పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అన్ని కేంద్రాల్లో ఎలక్షన్ కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఏఈఆర్వోలు, అధికారులు, సూపర్‌వైజర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామ పారాయణం



ప్రత్యేక అలంకరణలో సతీసమేత శ్రీవేంకటేశ్వరస్వామి

ఎంవీపీ కాలనీ: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో శ్రీఐశ్వర్యలక్ష్మీ, సౌభాగ్య లక్ష్మీ, సమేత వల్లభ వేంకటేశ్వర కల్యాణ ఉత్సవ ఆధ్యాత్మిక పీఠం వైభవోత్సవాలు బుధవారం కొనసాగాయి. వల్లభ వేంకటేశ్వర ఆధ్యాత్మిక పీఠం, వైదిక విజ్ఞాన విపంచి, విశాఖ సాగరతీర కార్తీక దీపోత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు ఈ నెల 9వ తేదీ వరకు జరగనున్న విషయం తెలిసిందే. బుధవారం కార్యక్రమంలో భాగంగా విష్ణుసహస్రనామ పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో సతీసమేత శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. సహస్ర దీపాలంకరణ, విశేష హారతులు జరిపారు. విజయశ్రీ బృందం నిర్వహించిన సంగీత కచేరీ అలరించింది. వయోలిన్, తబల వాయిద్య ప్రదర్శనలు మంత్రముగ్ధులను చేశాయి.

వ్యక్తి ఆత్మహత్య



అప్పలరాజు (ఫైల్)

పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లిలో అప్పుల బాధ తాళలేక ఒక రైతు ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు ఏఎస్‌ఐ ఎన్.శ్రీనివాసరావు చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పులపా అప్పలరాజు (41) అప్పులు తీర్చలేనన్న భయంతో ఈ నెల 5న పురుగు మందు తీసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

నిషేధిత మందుల స్వాధీనం

ఎంవీపీ కాలనీ: పలు రకాల నిషేధిత మందులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సులో ప్రయాణిస్తున్న ఓ నిందితుడి వద్ద నుంచి టాస్క్‌ఫోర్స్ పోలీసులు 0.5 ఎంజీ, 0.25 ఎంజీ అల్ప్రాజోలం మాత్రలు 3500, బ్రాండాక్సల్ కాఫ్ సిరప్‌లు 40 స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని ఎంవీపీ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆహార నియమాలతో క్యాన్సర్ నివారణ



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రామావత్ దేవ్

ఎంవీపీ కాలనీ: మంచి ఆహార నియమాలు పాటిస్తే క్యాన్సర్ దరిచేరదని మెడికవర్ హాస్పటల్స్ క్యాన్సర్ చికిత్సల విభాగం వైద్యుడు, క్యాన్సర్ క్యూర్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ రామావత్ దేవ్ తెలిపారు. ఎంవీపీ కాలనీలోని మెడికవర్ ఆస్పత్రి, స్నిపర్స్ మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక హెల్త్ ఎరీనాలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 500 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలతో పాటు మందులు అందజేశారు. బీపీ, షుగర్, ఈసీజీ, గర్భాశయ, మమ్మోగ్రఫీ తదితర పరీక్షలు చేశారు. అనంతరం ‘క్లోజ్ ది కేర్ గ్యాప్’ థీమ్‌తో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామావత్ దేవ్ మాట్లాడుతూ సాధారణంగా మానవ శరీరంలో కణ విభజన ఒక క్రమపద్ధతిలో జరుగుతుందన్నారు. అయితే కొన్ని కారణాల వల్ల ఆ కణాలు నియంత్రణ కోల్పోయి అస్తవ్యస్తంగా విభజన చెంది కణ సమూహాలను ఏర్పరుస్తాయన్నారు. ఆ స్థితినే క్యాన్సర్‌గా పరిగణిస్తామని చెప్పారు. మంచి ఆహారపు నియమాలు, మద్యం, పొగాకుకు దూరంగా ఉండటం ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధునాతన వైద్య విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాహిత్య, స్నిపర్స్ పార్క్ ఉపాధ్యక్షుడు బాలాజీ, కార్యదర్శి వర్మ, లెండి కళాశాల చైర్మన్ మధుసూదన్ పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో ఆవర్తన పట్టిక దినోత్సవం



గెలుపొందిన విద్యార్థినులతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

దాబాగార్డెన్స్ : నగరంలోని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బుధవారం జాతీయ ఆవర్తన పట్టిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ అరుణపద్మ, రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకుడు డాక్టర్ బి. కల్యాణ్‌రామ్, సంతోషి, అనూష, విద్యా కల్పన, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

సమాజాన్ని నడిపించేది సాహిత్యం



మాట్లాడుతున్న సూర్యప్రకాశరావు

సీతంపేట: సమాజాన్ని సరైన మార్గంలో నడిపించేది సాహిత్యమని నవసాహితి ఇంటర్నేషనల్(చెన్నై) అధ్యక్షుడు ఎస్.వి.సూర్యప్రకాశరావు అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సాహిత్యం ప్రతి ఒక్కరికీ అవసరమని, అది హృదయానికి సంబంధించినదన్నారు. మానవ సంబంధాలు, అనుబంధాలకు సాహిత్యం వారధి అని పేర్కొన్నారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ మారుతున్న సమాజంలో సాహిత్యం ముఖ్య భూమిక పోషిస్తూ జనుల్లో విలువలను, ఆత్మీయతను పెంపొందిస్తుందన్నారు. డాక్టర్ కె.జి. వేణు బంగ్లాదేశ్ కవి రచయిత ఖాజీ నజ్రుల్ ఇస్లాం సాహిత్యం, జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, రచయితలు సిహెచ్.చిన సూర్యనారాయణ, కొత్తూరి రమణ, డాక్టర్ డి.వి. సూర్యారావు, భాగవతుల సత్యనారాయణమూర్తి, వెలమల సిమ్మన్న, కె.వి.ఎస్.మూర్తి, కె.భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణులకు వసతి ఏర్పాటు



యునివర్సిటీలో వసతి గృహాలను పరిశీలిస్తున్న జెడ్సీ సన్యాసినాయుడు

జగదాంబ : ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీలకు విచ్చేస్తున్న మహిళా క్రీడాకారిణులకు వసతి ఏర్పాటు చేశామని జీవీఎంసీ జోన్‌-4 కమిషనర్ బి.సన్యాసినాయుడు తెలిపారు. ఈ పోటీలకు విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి వంద మందికి పైగా వివిధ క్రీడలకు సంబంధించి క్రీడాకారిణులు వస్తున్నారన్నారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు వారందరికీ ఏయూ ఉమెన్స్ హాస్టల్లో వసతి ఏర్పాటు చేశామన్నారు. తాగునీరు, విద్యుత్, భోజనం, శానిటేషన్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

హైస్కూళ్ల ఆకస్మిక సందర్శన

ఆనందపురం : మండలంలోని పలు హైస్కూళ్లను డీఈవో ఎల్.చంద్రకళ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. గిడిజాల, గండిగుండం హైస్కూళ్లను పరిశీలించారు. పాఠశాలల్లోని మౌలిక సౌకర్యాలు, తరగతుల నిర్వహణ, ప్రభుత్వం అందించిన ట్యాబ్స్‌ను విద్యార్థులు వినియోగిస్తున్న తీరు అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఏ3 పరీక్ష పేపర్లను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పరిశీలించగా వెనుకబడి ఉన్నట్టు గుర్తించారు. ఈ మేరకు ఉపాధ్యాయులను వివరణ కోరి వారికి పలు సూచనలు చేశారు. అనంతరం పెందుర్తి హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ఏయూ సమాచారం..

సమ్మిళిత శిక్షణ తరగతులు ఉపయుక్తం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

ఏయూ క్యాంపస్: సమ్మిళిత శిక్షణ తరగతులు ఉపయుక్తంగా నిలుస్తాయని ఏయూ సైన్స్, టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు అన్నారు. ఏయూ సెంటర్ ఫర్ బే ఆఫ్ బెంగాల్, ఈఎస్ఎస్వో-ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫిషరీ ఓషనోగ్రఫీ ఫర్ ద ఓషన్ డెకేడ్ శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలానికి దోహదపడేలా శిక్షణ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. పోగో సెక్రటేరియేట్ సీఈవో డాక్టర్ సోఫీ సీయవే ఇక్కడ పొందిన జ్ఞానం నిరంతరం ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రం సంచాలకుడు ఆచార్య పి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి అంబేడ్కర్‌కు ఘన నివాళి



రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న షారోన్ రాజు

ఏయూ క్యాంపస్: త్యాగానికి రూపంగా రమాబాయి అంబేడ్కర్ నిలుస్తారని ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి అంబేడ్కర్ జయంతిని బుధవారం విభాగంలో నిర్వహించారు. ముందుగా రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ రమాబాయి అంటే ఒక పోరాటమని చెప్పారు. అంబేడ్కర్ విజయం, ప్రగతిలో రమాబాయి కృషి, సహకారం నిరుపమానమన్నారు. నేటితరం యువత ఇటువంటి మహనీయుల జీవితాలను చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగదు తరలిస్తున్న వ్యక్తిపై కేసు

ఎంవీపీ కాలనీ: ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తరలిస్తున్న ఓ వ్యక్తిని ఎంవీపీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి సత్యం కూడలి వద్ద నాకాబందీ నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి వద్ద రూ.4,29,100 నగదును ఎంవీపీ సీఐ సంజీవరావు గుర్తించారు. దీంతో ఆ నగదుకు సంబంధించి వివరాలు అడగ్గా విజయనగరం నుంచి వస్తున్న జైకుమార్ అనే ఆ వ్యక్తి నుంచి ఎలాంటి సమాధానం లేదు. దీంతో అతన్ని అదుపులోకి తీసుకున్న ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తనిఖీల్లో 84 వాహనాల సీజ్



ద్వారకా, ఫోర్త్‌టౌన్ పీఎస్‌ల ఆవరణలో సీజ్ చేసిన వాహనాలు

సీతమ్మధార: నగర పోలీస్ కమిషనర్ డా.రవిశంకర్ అయ్యనార్ ఆదేశాల మేరకు ద్వారకా, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మంగళవారం రాత్రి 10 గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము 5 గంటల వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ద్వారకా పీఎస్ పరిధిలో సీఐ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ ధరేంద్ర, ఆర్ఐల నేతృత్వంలో గురుద్వారా, సీతంపేట దుర్గాగణపతి ఆలయం, ఆశీలమెట్ట, ద్వారకానగర్, రామాటాకీస్, సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ తదితర ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేపట్టారు. నంబర్ ప్లేట్, సైలెన్సర్లు, పత్రాలు, మద్యం తాగిన నడిపిన 62 వాహనాలను సీజ్ చేశారు. ఫోర్త్‌టౌన్ పీఎస్ పరిధిలోని దొండపర్తి, డైమండ్ పార్కు, అక్కయ్యపాలెం హైవే తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి 22 వాహనాలను సీజ్ చేశారు. దీంతో ఈ రెండు పోలీస్ స్టేషన్ల ఆవరణ ద్విచక్ర వాహనాలతో నిండిపోయింది.

ఎరుకుమాంబకు భక్తుల జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వయంగా జలాభిషేకం చేశారు. దొండపర్తి, నెహ్రూబజార్, రైల్వే న్యూకాలనీ, పెదవాల్తేరు, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, శివాజీపాలెం, ఎన్ఏడీ, సీతమ్మధార, నక్కవానిపాలెం, రేసపువానిపాలెం, జగదాంబ, వన్‌టౌన్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం పసుపు, కుంకుమ, పలు రకాల పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారి చీరల బహిరంగ వేలం..

ఎరుకుమాంబ అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, జాకెట్లు గురువారం 8వ తేదీన, మరల 15వ తేదీన ఉదయం 10 గంటల నుంచి దేవస్థానం ప్రాంగణంలో బహిరంగ వేలం వేసి విక్రయిస్తామని ఆలయ ఈవో రమాబాయి, చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి



రవికుమార్ మృతదేహం

పరవాడ : లంకెలపాలెం-సబ్బవరం రహదారిలో మంత్రిపాలెం కూడలి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని కాకినాడకు చెందిన ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటనపై స్థానికులు, పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా.. కాకినాడ రూరల్(నియర్ కరెంట్ ఆఫీస్)కు చెందిన టి.రవికుమార్(47) అనే లారీ డ్రైవర్ బుధవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మంత్రిపాలెం కూడలిలో రోడ్డు పక్కన తన లారీని నిలిపి సొంత పనిపై రహదారి దాటుతున్నాడు. ఇంతలో వెనుక నుంచి వచ్చిన మరో వాహనం అతడిని ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవికుమార్ అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. స్థానికులు అందించిన సమాచారంతో అక్కడికి చేరుకున్న పరవాడ పోలీసులు మృతుడి వద్దనున్న ఆధారాల సాయంతో కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభించామన్నారు.

భవన నిర్మాణాలపై 1 శాతం సెస్ చెల్లించాలి

సీతంపేట : విశాఖ జిల్లాలోని అన్ని కన్‌స్ట్రక్షన్ యూనిట్లు, భవనాల నిర్మాణానికి వెచ్చించే వ్యయంలో 1 శాతం సెస్ రూపంలో ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.సునీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని భవన, ఇతర నిర్మాణాలు చేపట్టే యజమానులు తమ నిర్మాణాలను ఎస్టాబ్లిష్‌మెంట్ రూపంలో సమీప మీ సేవా, లేదా వార్డు సచివాలయంలో గాని, మీ సేవా పోర్టల్‌లో గాని నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఎస్టాబ్లిష్‌మెంట్స్ ఫారం సీ రూపంలో రిటర్న్ కార్మిక శాఖ సంబంధిత అధికారికి అందజేయాలన్నారు. జిల్లాలో భవన నిర్మాణ యజమానులు, కాంట్రాక్టర్లు, భవన నిర్మాణ కార్మిక చట్టం 1996 ప్రకారం భద్రతా చర్యలు తీసుకోవాలని, కార్మికులకు హెల్మెట్‌లు, రక్షణ గ్లౌజ్‌లు, ఎత్తులో పనిచేసే వారు కింద పడిపోకుండా కాపాడే యంత్ర సదుపాయం కల్పించాలని చెప్పారు. జిల్లాలోని వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానులు ఈ నెల 29లోగా మీ సేవా కేంద్రంలో, వార్డు సచివాలయంలో రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ పూర్తి చేయాలని తెలిపారు. లేనిపక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.